వినుక్కొన్నాడు రమేష్.

"ఏం లేదండీ. ఎన్నాళ్ల బట్టో టీవీ కొనుక్కుందామని అడుగుతూ ఉంటే మీరేం మాట్లాడటం లేదు. మీకేం ఉదయం వెళ్లిపోయి రాత్రికి వస్తారు. నాకింట్లో ఏం తోస్తుంది చెప్పండి. పిల్లలైనా ఉంటారేమో అంటే వాళ్లు స్కూలుకెళ్లి పోయి సాయంకాలం దాకా రారు. ఎంతకని ఇరుగు పొరుగు ఇళ్లకెళ్లి టీవీ చూస్తాను. కూలి చేసుకొని బ్రతికేవాళ్ల ఇళ్లల్లో కూడా ఈ కాలంలో టీవీ ఉంటోంది. 'మీ ఇంట్లో టీవీ లేదు' అని ఎవరైనా అడిగితే సమాధానం చెప్పడానికే నాకు సిగ్గువేస్తోంది. ఈ రోజు ఆ ఎరియర్స్‌తో టీవీ కొనుక్కు రండీ" అంది ప్రాధేయంగా.

రమేష్ బస్సులో కూర్చున్నాడే కానీ భార్య కోరికే మనసులో మెదులుతూ ఉంది. తానేం టీవీ కొనలేని దీనస్థితిలో లేడు. కానీ ఎం.ఆర్.ఒ. ఆఫీసులో గుమస్తాగా చేసే తను తన ఇద్దరి పిల్లలని తనలా గుమస్తాలాగా తయారుచేయకుండా వాళ్ల భవిష్యత్తుని తీర్చిదిద్దాలన్న ధ్యేయంతో తలకు మించిన భారంతో ఇద్దరిని ఫీజులెక్కువని ఆలోచించకుండా మంచి కాన్వెంటులో చేర్పించాడు. తాను ఖర్చులని కుదించుకుంటూ పైన పైన పిల్లల పై చదువుల కోసం పొదుపు చేసుకొంటున్నాడు. వాళ్లు తొంభై, తొంభై ఐదులు మార్కులతో ప్రోగ్రెస్ రిపోర్టులు తీసుకొచ్చినప్పుడు గర్వంతో పొంగిపోతున్నాడు. ఈ విషయం శ్యామలకే తెలుసు. అయినా ఏ కోరికలూ కోరని శ్యామల ఎన్నాళ్ల బట్టో టీవీ కొనమంటోంది. చూద్దాం పర్యవసానంగా అనుకున్నాడు రమేష్.

ఆ సాయంకాలమే టీవీ ఇల్లు చేరింది. శ్యామల సంతోషం అంతా ఇంతా కాదు. ఇరుగు పొరుగు అందరికీ చూపించింది. కాఫీలు కూడా సప్లై చేసింది. పిల్లలు ముచ్చటపడ్డారు.ఇంక శ్యామలకి ఆ రోజు నుంచి కాలక్షేపానికి కొదువలేదు. ఏ సీరియల్నీ వదలడం లేదు. తెలుగే కాకుండా తమిళ వెర్షన్సు కూడా చూస్తోంది. ఎడ్వర్‌టైజ్‌మెంట్లు వచ్చినప్పుడు పనిచేసుకొంటోంది. ఏ లోటూ ఇంట్లో వాళ్లకి రాకుండా మేనేజ్ చేస్తోంది.రమణ, వినయ్‌కి కూడా హోంవర్కు చేసుకుందామని గదిలో కూర్చున్నా దృష్టి మాత్రం టీవీ మీదే ఉంటోంది. ఏ సీరియల్ ఏ టైముకొస్తుందో వాళ్లకి కరతలామలకమే. పైగా ఏడయింది. హోంవర్కు చెయ్యండ్రా అంటే ఈ సీరియల్ అయిపోతేనే కానీ ఏడయినట్టు కాదమ్మా అంటున్నారు.

మూడు నెలలు ఇట్టే గడిచిపోయాయి.

ఆదివారం..

రమేష్ తీరుబడిగా పేపరు పట్టుకొని వాలుకుర్చీలో కూర్చున్నాడు. రమ, వినయ్ బిక్కమొగాలేసుకొని ప్రోగ్రెస్ రిపోర్టులు చేతిలో పట్టుకొని సంతకం కోసం తండ్రి దగ్గర నిలబడ్డారు.వాళ్ల చేతిలోంచి తీసుకున్న ప్రోగ్రెస్ రిపోర్టులు చూసేటప్పటికి షాకయిపోయాడు రమేష్. ఇద్దరికీ ఏ సబ్జెక్టుల లోను నలభై దాటలేదు. ఉదయం వెళ్లిపోయి రాత్రికే ఇల్లు చేరే రమేష్ భార్య పర్యవేక్షణలో పిల్లలు బాగా చదువుకొంటున్నారని వాళ్ల మీద దృష్టిపెట్టలేదు. ఇప్పుడే రిపోర్టులు చూస్తే పరిస్థితి అర్థమయింది.

"శ్యామలా.." వంటింట్లోకి వినిపించేటట్టు ఒక్క గావుకేక పెట్టాడు రమేష్. అప్పటికే ప్రోగ్రెస్ రిపోర్టులు చూసి అవాక్కయిన శ్యామల భర్త నోరు తెరవకుండానే "టీవీని రేపే ఎవరికైనా అమ్మేద్దామండీ" అంది బేలగా.

**-వి.సత్యవతీదేవి (గుమ్మలక్ష్మీపురం)**

***

# ఎస్.ఎమ్.ఎస్.సుజాత

ఆఫీసు నుంచి వచ్చిన కరుణాకర్ సోఫాలో కూలబడి, షూస్ విప్పుతూ "సుజీ కొంచెం మంచినీళ్లు ఇయ్యి" అన్నాడు.

టీవీలో 'అంతా మాయే' ప్రోగ్రామ్ చూస్తూ వాళ్లు అడిగిన ప్రేక్షకుల ప్రశ్నకి సమాధానం ఎస్.ఎమ్.ఎస్. చేస్తూ దీక్షగా ఉన్న సుజాత భర్త అడిగినది వినిపించుకోలేదు.దాంతో కోపం వచ్చిన కరుణాకర్ గట్టిగా "సుజీ" అని అరిచాడు."అబ్బా! ఏమిటండి అంతలా అరిచారు" అంది ఉలిక్కిపడి.

"ఏం చేయను.. భావనా ఎంత పిలిచినా నువ్వు పలకుండా, ఆ ఫోన్‌తో కూర్చుని నా ప్రాణం తీస్తోంటే" అన్నాడు అసహనంగా.

"అబ్బబ్బ, ఎప్పుడూ నా ఫోన్ గురించి గోలేనా"

"గోల గోలేమిటే నువ్వే అస్తమానూ ఆ ఫోన్ రిమోట్ పుచ్చుకుని ఎప్పుడు చూసినా ఆ టీవీ ముందు కూర్చుని మా అందరిని విసిగిస్తున్నావ్"

"ఆ.. అదే ఏడుపు, ఇంతకీ ఏమిటి మీ గోలకి కారణం"

"కాసిని మంచి నీళ్లు మొహాన కొడితే సంతోషిస్తా"

"ఆ కొడతాలెండి?" అంటూ కిచెన్‌లోకి వెళ్లింది, కోపంగా సుజీ!మంచి నీళ్లతో పాటు ఒక ప్లేటులో పకోడీలు, టీ కూడా తెచ్చేసింది. ఏకంగా!

"అబ్బా పకోడీలు చేయటానికి కూడా నీకు తీరిక దొరికిందే" అన్నాడు నీళ్లు తాగి గ్లాసు పక్కన ఉంచి.

"ఆ సంబరం" అంటూ తిరిగి టీవీ ముందు చతికిల బడింది.పకోడీ ఒకటి తీసి నోట్లో వేసుకుని "ఛీ ఛీ ఎప్పుడు చేశావ్ ఈ పకోడీలు, లేక ఫ్రిజ్‌లో ఉంచావా ఇంత చల్లగా చచ్చాయి" అన్నాడు!

"ఆ మరే నిన్న చేశాను" అంది తలతిప్పకుండానే!

"నీ పిచ్చితగలెయ్యా ఇంట్లో వంట కూడా సరిగా చేయవా ఏమిటే, నీ టీవీ ప్రోగ్రామ్స్ కాదుకానీ చచ్చేచావయింది కదే. ఒక పక్క ఫోన్ బిల్లు అదిరిపోతోంది. ఒక పక్క నీ గోల, అబ్బబ్బ, ఏం టీవీ ప్రోగ్రామ్స్‌రా బాబు" అని విసుక్కుంటూ టీ తాగి వెళ్లిపోయాడు.

"ఏం టిఫిన్ తినలేదా" అంది మధ్యలో ప్రకటనలు వచ్చినపుడు తల తిప్పి చూసిన సుజాత.

"ఆ అని నువ్వే తిను కాలక్షేపంగా ఉంటుంది" అంటూ లోపలకు వెళ్లబోతూ.

"వంట చేశావా అది కూడా లేదా పిల్లలు వచ్చే సమయం అయింది" అన్నాడు.

"అయిందిలెండి మీరేం గాబరా పడక్కర్లా. మధ్యలో ప్రకటనలు వచ్చినపుడు లేచి కుక్కర్ పెట్టేశాను!" అంది.

ఆ రోజు రాత్రి "సుజా మా అమ్మని రమ్మని ఫోన్ చేస్తానూ" అన్నాడు.

"ఇప్పుడు ఎందుకు"

"అదే నీకు టీవీ మీద ధ్యాసతోనే సరిపోతోంది కదా. పిల్లల్ని చూడు పాపం సరయిన తిండి వేళకు లేక ఎలా పాడయిపోతున్నారో మార్కులు కూడా చాలా తక్కువ వస్తున్నాయి ఈమధ్య. అమ్మ వస్తే కనీసం కడుపు నిండా తిండయినా తింటారు" అన్నాడు.

"ఆవిడ వస్తే చేస్తుందనా మీ ఆలోచన. మీకు తోడు ఆవిడ కూడా సతాయిస్తుంది నన్ను"

"అదేం లేదులే. నీ టీవీకి అడ్డురాదు" అన్నాడు!

"అయితే సరే! నాకు మరీ అటూ ఇటూ పరుగులు పెట్టినట్లుగా ఉంటోంది. రమ్మనండి" అంది ముసుగువేసేసి."ఓసీ నీ ఇల్లు బంగారం కాను" అన్నాడు పడుకుంటూ."బాగా గుర్తు చేశారు. ఈ ప్రోగ్రామ్, రేపు 'డి' చానల్‌లో ఉందండి" అంది సగం నిద్రలోనే.

'హతోస్మి' అనుకుంటూ తాను కూడా నిద్రలోకి జారాడు.రెండు రోజుల అనంతరం, సుజాత అత్తగారు దిగింది.వచ్చిన రోజు బాగోదని సుజాత వంట చేసింది. అత్తగారు టీవీ చూస్తూ హాయిగా కాలక్షేపం చేసింది.

మరునాటి నుంచి ఒకో పని మెల్లిగా అత్తగార్కి షిఫ్టు చేసేసింది. టీవీ చూడటానికి లేకుండా పోయిందని అత్తగారు అనసూయమ్మ విసుక్కోసాగింది.

ఒకరి తరువాత ఒకరు ఫిర్యాదులు చేయసాగారు కరుణాకర్‌కి.ఇదో లేనిపోని తలనెప్పి అయింది కరుణాకరానికి. ఎవరినీ ఏమీ అనలేడు.

"అమ్మా నువ్వు ఖాళీ సమయాల్లో రేడియో వినవే. అందులో మంచి ప్రోగ్రామ్స్ వస్తాయి" అన్నాడు రాజీగా!

ఇప్పుడు ఆవిడ రేడియో వినసాగింది. రేడియోలో కూడా ఇప్పుడు ఎస్.ఎమ్.ఎస్.ల ద్వారా బహుమతులు ప్రారంభం అయ్యాయి. దాంతో ఆవిడ కూడా మనవలని అడిగి ఎస్.ఎం.ఎస్.లు ఎలా ఇవ్వాలో నేర్చుకుని ఆ పనిలో పడింది.ఇప్పుడు కరుణాకర్ పని కుడితిలో పడ్డట్టు అయింది. రెండు ఫోన్‌లు చెరొకళ్లు పట్టుకుని బిజీగా ఉన్నారు.కరుణాకరం బాధ అర్థం అయినట్లుగా టీవీ కాస్తా పాడయిపోయింది. అమ్మయ్య, ఓ ఆర్నెలలు బాగు చేయకపోతే సరి అనుకున్నాడు!

వారం అయ్యేసరికి ఇంటికి వచ్చినపుడల్లా సుజాత ఎవరింట్లో ఉందో వెతుక్కోవాల్సి వచ్చింది.

రోజుకో ఇంటికి వెళ్లి ప్రోగ్రామ్స్ చూడటం ప్రారంభించింది. అత్తగారు కూడా ఇక్కడ నాకేం తోచటం లేదంటూ మరో కొడుకు దగ్గరకు పోయింది. దాంతో కరుణాకరం తాళం వేసిన ఇల్లు చూసి రోజూ 'దీనికన్నా, అదే బెటరు' అనుకుని టీవీ రిపేరు చేయించాడు. తిరిగి సుజాత యధావిధిగా టీవీ ప్రోగ్రామ్స్ చూడటంలో పడింది. ఎస్.ఎమ్.ఎస్. సుజాత గారిల్లు అంటే, ఆ కాలనీలో ఎవరయినా ఇట్టే చెబుతారు హేట్సాఫ్ టీవీ! అదండీ మరి కథ!

**-కాకరాల భానుమతి (హైదరాబాద్)**